ప్రజాశక్తి

శుక్రవారం 7 జూన్ 2024

5

అనంతపురం

కళ్యాణదుర్గంలో సమస్యాత్మక కాలనీలను పరిశీలిస్తున్న ఎస్పీ గౌతమిశాలి



మంత్రులెవరు..?

- అమాత్య యోగంపై ఆశలు
- సీనియార్టీ, సామాజిక తరగతుల వారీగా అంచనాలు
- అధిష్టానం నుంచి ఇప్పటి వరకు అందని స్పష్టత

సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎప్పుడూలేని విధంగా సైకిల్ క్లీన్‌స్వీప్ చేసింది. కూటమి తరుపున బిజెపి నుంచి ధర్మవరంలో సత్యకుమార్ గెలుపొందారు. తక్కిన 13 అసెంబ్లీ స్థానాల్లోనూ తెలుగుదేశం పార్టీ నాయకులందరూ విజయం సాధించారు. రాష్ట్రంలోనూ కనీవిని ఎరుగని విధంగా కూటమి విజయం సాధించింది. అధికారపార్టీగానున్న వైసిపి రాష్ట్రంలో 11 స్థానాలకే పరిమితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పడబోయే తెలుగుదేశం ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా నుంచి ఎవరికి మంత్రివర్గంలో చోటు లభించనుందన్నది చర్చనీయాంశంగా ఉంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కూటమి తరుపున జిల్లాలో ధర్మవరం ఒక్క స్థానంలోనే బిజెపి అభ్యర్థి ఉన్నారు. తక్కిన అందరూ తెలుగుదేశం పార్టీ నుంచే ఉన్నారు. అందులో కొంత మంది సీనియర్లు ఉన్నారు. గతంలో మంత్రులుగా పనిచేసిన వారూ ఉన్నారు. కొత్తగా ఎన్నికైనా వారూ ఉన్నారు. వీరిలో చాలా మంది మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. అనంతపురం జిల్లాలో రాయదుర్గం ఎమ్మెల్యేగా గెలుపొందిన కాలవ శ్రీనివాసులు బిసి సామాజిక తరగతి నుంచి ఉన్నారు. ఆయన 2014లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన కూడా మరోమారు మంత్రివర్గంలో స్థానం కోసం ఆశిస్తున్న వారిలోనున్నారు. మంత్రి పదవి ఆశిస్తున్న వారిలో ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పేరు కూడా ప్రముఖంగానే విన్పిస్తోంది. 2014లో ఆయన ఉరవకొండలో ఓటమి చెందడంతో మంత్రివర్గంలో చోటు దక్కలేదు. ఆ తరువాత ఎమ్మెల్సీ ఇచ్చినా మంత్రివర్గంలోకి తీసుకోలేదు. ఈసారి తప్పకుండా ఆయనకు అవకాశం లభిస్తుందనే ప్రచారం సాగుతోంది. సామాజిక సమీకరణల్లో ఆయనకు స్థానం లభిస్తుందా లేదా అన్నది చూడాల్సి ఉంది. గుంతకల్లు నుంచి గెలుపొందిన గుమ్మనూరు జయరాం వైసిపి ప్రభుత్వ హయాంలో మంత్రిగా పని చేశారు. ఎన్నికల ముందు ఆయన ఆ పార్టీతో విభేదించి తెలుగుదేశం పార్టీలో చేరారు. గుంతకల్లు నియోజకవర్గం టిడిపి అభ్యర్థిగా ఆయన గెలుపొందారు. ఆయన కూడా సామాజిక సమీకరణల్లో భాగంగా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు.

సత్యసాయి జిల్లాలో రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గెలుపొందిన పరిటాల సునీత 2014 తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మొదట పౌర సరపరాల మంత్రిగా పనిచేశారు. ఆ తరువాత ఆమెను స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా మార్చారు. ఈసారి రాప్తాడు నుంచి ఆమె గెలుపొందారు. మంత్రివర్గంలో స్థానం ఆసిస్తున్న వారిలో ఆమె కూడా ఉన్నారు. కూటమి తరుపున జిల్లా నుంచి పోటీ చేసి గెలుపొందిన ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ కూడా మంత్రి పదవి ఆశిస్తున్నారు. బిసి సామాజిక తరగతికి చెంది ఆయన కూడా మంత్రివర్గంలో చోటు దక్కే అవకాశముందని జోరుగా ప్రచారం సాగుతోంది. ఇలా ప్రధానమైన పేర్లు పెద్దఎత్తున ప్రచారంలోనున్నాయి. ఇందులో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టను్న చంద్రబాబునాయుడు ఎవరికి అవకాశం కల్పిస్తారన్న దానిపై సర్వత్రా చర్చ నడుస్తోంది. మంత్రులుగా ఎవరిని తీసుకోవాలనే దానిపై చంద్రబాబు మదిలో ఎవరున్నారన్నది ఇప్పటికీ వరకు బయటకు రాలేదు. ఆశావహులు మాత్రం రాష్ట్ర రాజధానికి చేరుకుని వారి ప్రయత్నాలు చేసుకునే పనిలోనున్నారు. కూటమిలో ఇతర పార్టీల సర్దుబాట్లతోపాటు ఇక్కడ ఎవరికి స్థానం కల్పిస్తారన్నది చూడాల్సి ఉంది. మరో రెండు, మూడు రోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశమున్నట్టు తెలుస్తోంది.



శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే సహించం

సమస్యాత్మక ప్రాంతాల్లో ఎస్పీ గౌతమిశాలి పర్యటన

ప్రజాశక్తి-రాయదుర్గం

శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీపడొద్దని జిల్లా ఎస్పీ గౌతమిశాలి పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. ఎస్పీ గురువారం రాయదుర్గం పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ఎస్పీ పర్యటించారు. ప్రధానంగా లక్ష్మీబజార్, కణేకల్లు రోడ్డు, ఓబుళాచారిరోడ్డు, నేసేపేట, శాంతినగర్, వినాయక కూడలి, తేరుబజార్, మారెమ్మగుడి కాలనీ, పైతోట, తదితర ప్రాంతాల్లో కలియ తిరిగారు. జాతీయ రహదారి-544 డిడి అంతర్రాష్ట్ర సరిహద్దు గాలి మారెమ్మ దేవస్థానం వద్ద ఉన్న చెక్‌పోస్ట్‌ను సందర్శించి తనిఖీలు చేశారు. ఆయా కాలనీల్లో తాజా పరిస్థితులపై స్థానిక సిఐ ఎం.శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమైన కాలనీల్లో మొబైల్ బృందాలచే పెట్రోలింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి, ఇక ప్రజలు ఎవరి పనుల్లో వారు నిమగ్నం కావాలని ఎక్కడా అల్లర్లు, హింస, ఆస్తి నష్టం లాంటి చర్యలకు పాల్పడరాదని హెచ్చరించారు. అతిక్రమిస్తే కేసు నమోదు చేయడంతో పాటు రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి తనిఖీలు చేశారు. కేసుల పరిస్థితిపై సిఐని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినప్పటికీ సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు పికెట్ కొనసాగుతుందని, మొబైల్ పెట్రోలింగ్ వాహనాలు సంచరిస్తాయని తెలిపారు. ఇందుకోసం పోలీస్ శాఖ అదనంగా 95 వాహనాలను అద్దెకు తీసుకుందన్నారు. సీసీ కెమెరాలు, రోడ్డుపై సర్వే లెన్సు కెమెరాలతో నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఎస్పీ వెంట కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాస్‌గౌడ్, రాయదుర్గం సిఐ ఎం.శ్రీనివాసులు ఉన్నారు.

సమస్యలు సృష్టిస్తే రౌడీషీట్ తెరుస్తాం : ఎస్పీ

కళ్యాణదుర్గం : రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎక్కడైనా సమస్యలు సృష్టిస్తే రౌడీషీట్ తెరుస్తామని ఎస్పీ గౌతమిశాలి హెచ్చరించారు. ఎస్పీ గురువారం డీఎస్పీ బి.శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి పట్టణంలోని సమస్యాత్మక కాలనీల్లో పర్యటించారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు గెలుపు అనంతరం జరిగిన విజయోత్సవ ర్యాలీలో కొందరు వైసిపి నాయకుడు ఉమామహేశ్వర నాయుడు ఇంటిపై దాడి చేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. శాంతియుత మార్గంలో విజయోత్సవాలు చేసుకోవడంలో తప్పు లేదని, కానీ ప్రజలను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించడంతో పాటు ఇల్లు, వాహనాలు ధ్వంసం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే ఎంతటి స్థాయి నాయకులైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే సీసీ ఫుటేజ్ ద్వారా ఘటనకు జరిగిన అన్ని అంశాలను పరిశీలించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఇదే తరహాలో ఇతర చోట్ల శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే తీవ్రమైన పరిణామాలు తప్పవని హెచ్చరించారు. అవసరమైతే రౌడీమూకలను జిల్లా బహిష్కరణ చేస్తామన్నారు.

విజయవంతంగా ముగిసిన ఎన్నికల ప్రక్రియ

సహకరించిన అందరికీ ధన్యవాదాలు

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో సాధారణ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, విజయవంతంగా పూర్తి అయ్యిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వి.వినోద్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు సజావుగా సహకరించిన ప్రజలు, ఎన్నికల అధికారులు, జిల్లా అధికారులు, మీడియా మిత్రులు, ఎన్నికల పరిశీలకులకు ధన్యవాదాలు తెలిపారు. మార్చి నెలలో ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి కౌంటింగ్ ప్రక్రియ వరకు ఎన్నికల నిర్వహణలో వివిధ శాఖల అధికారులు అందించిన సహాయ సహకారాలు, భాగస్వామ్యం మరువలేనిదన్నారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని, సమిష్టి కృషితో ఎన్నికలను పారదర్శకంగా పూర్తి చేసినట్లు తెలియజేశారు. జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహించడం సంతోషాన్ని ఇస్తోందన్నారు. జిల్లా, మండలం, డివిజన్ స్థాయిలో అందరు అధికారులు, పోలీస్ సిబ్బందితో సమన్వయంతో పని చేశారన్నారు.

ఈ-పోస్ట్‌తో శుభాకాంక్షలు తెలిపే అవకాశం

పోస్టల్ శాఖ వినూత్న కార్యక్రమం

ప్రజాశక్తి-అనంతపురం

2024 సార్వత్రిక ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన నాయకులకు అభినందనలు తెలిపేందుకు తపాలా శాఖ వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈపోస్ట్ సందేశాల ద్వారా 2024లో ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు అభినందనలు తెలిపే అవకాశాన్ని కల్పించింది. విజయం సాధించిన ప్రతి ప్రజా ప్రతినిధికి ఈ పోస్టు సందేశాల ద్వారా శుభాకాంక్షలు తెలియజేయవచ్చు. కేవలం రూ.10 చెల్లించి ఈ పోస్టు ద్వారా వారికి నచ్చిన ప్రజాప్రతినిధికి శుభాకాంక్షలు తెలియజేవచ్చు. పోస్టుఫీసు ద్వారా ఇలా పంపించిన సందేశాలు నేరుగా వారికి నాయకుని చేతికే చేరుతాయి. ఈపోస్ట్ ద్వారా రాష్ట్రంలోని 1.55 లక్షల పోస్ట్ ఆఫీస్‌ల నెట్‌వర్క్, ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిషన్, ఫిజికల్ డెలివరీ కలయికతో భారతదేశంలోని ఏ చిరునామాకైనా సందేశాలను పంపే అవకాశం ఉంటుంది. ఇంటర్నెట్ ద్వారా సందేశాలను సాఫ్ట్ కాపీగా పంపుతుంది. గమ్యస్థానంలో అది హార్డ్ కాపీ రూపంలో చిరునామాదారునికి చేరుతుంది. కేవలం పది రూపాయల ఖర్చుతో ఈ సందేశాన్ని పంపే అవకాశాన్ని పోస్టల్ శాఖ అందుబాటులోకి తెచ్చిందని ఆ శాఖ జిల్లా ఉన్నతాధికారులు తెలియజేశారు.

చంద్రబాబును కలిసిన కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

టిడిపి అధినేత, కాబోయే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును గురువారం రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే యువ నాయకుడు, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్‌ను కాలవ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు బీసీ నేత గంజి నాగరాజు ఉన్నారు.

చంద్రబాబు నాయుడుతో కాలవ శ్రీనివాసులు

మా దగ్గరే కొనాలి..!

- పుస్తకాల విక్రయాలపై ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల హుకుం
- యూనిఫాం, బెల్ట్, బ్యాడ్జీలపైనా ఆదేశాలు
- అడ్డంగా దోచుకుంటున్నా నోరుమెదపని విద్యాశాఖ

ప్రజాశక్తి-హిందూపురం

'విద్యార్థులకు అవసరమైన పుస్తకాల నుంచి సాక్సుల వరకు ఏది కావాలన్నా మా దగ్గరే కొనాలి...!' అంటూ ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు హుకుం జారీ చేస్తు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అడ్డంగా దోచుకుంటున్నాయి. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ఓ ప్రయివేటు పాఠశాలలో స్టేషనరీ ధరలు ఇలా ఉన్నాయి. యూనిఫాం (ఒక జత) రూ.1500 నుంచి రూ. 3000, బెల్ట్ రూ.150 నుంచి 200, టై రూ.100, బ్యాగు రూ.700 నుంచి రూ. 1000, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ రూ.3000 నుంచి రూ.5000 వరకు విక్రయిస్తున్నారు. ఇవి చాలదన్నట్లు వర్క్ బుక్ ల పేరుతో రూ.3వేల నుంచి 5వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. ఇలా ప్రతిది ఇక్కడే కొనాలన్న నిబంధనలు విధించి చదువును కిరాణ దుకాణంలోని సరుకుల్లా విక్రయిస్తున్నారు. ఈ విషయాలు విద్యాశాఖ అధికారులకు తెలిసినప్పటికి కనీస చర్యలు తీసుకోకుండా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను మాత్రమే బోధించాలి. దీనికి సంబంధించి వారి విద్యార్థుల సంఖ్యను బట్టి ఎంఇఒకార్యాలయం ద్వారా పాఠ్యపుస్తకాలు తెప్పించుకోవాలి. ఆ రేట్లకే విద్యార్థులకు పుస్తకాలను ఇవ్వాలి. ఇక నోటు పుస్తకాలు విద్యార్థుల అవసరాన్ని బట్టీ తల్లిదండ్రులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ పాఠ్యపుస్తకాలకు, నోటు పుస్తకాలకు గంపగుత్తగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల విద్యార్థుల తల్లిదండ్రులను నగదు వసూలు చేస్తున్నాయి. పుస్తకాల కొనుగోలు ధరల కంటే రెట్టింపు ధరలను వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం నోరుమెదపకపోవడంలో ఆంతర్యమేంటని విద్యార్థి సంఘాల నేతలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అలాగే నిబంధలకు విరుద్ధంగా యూనిపాం, టై, బెల్టు, బ్యాడ్జీ, షూలను తమ దగ్గరే కొనుగోలు చేసి తీరాల్సిందేనంటూ హుకుం జారీ చేస్తుండటం గమనార్హం. తమ పిల్లల భవిష్యత్ బాగుండాలన్న విద్యార్థుల తల్లిదండ్రుల కోరిక కార్పొరేట్ పాఠశాలలకు కల్పతరువుగా మారుతోంది. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పాఠశాలల యాజమాన్యాలు వేలాది రూపాయల ఫీజుల భారం మోపుతున్నాయి. అడ్మిషన్ ఫీజు, బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ల్యాబ్, ట్యూషన్, స్పోర్ట్, స్పెషల్ డేస్, కమ్యూనికేషన్ ప్రోగ్రాం ఫీజులంటూ ఇప్పటికే వేలాది రూపాయలు వసూలు చేస్తున్న యాజమన్యాలు మళ్లీ పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, షూఅంటూ అందినకాడికి అందినంత దోచుకుంటున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు 1616 హైస్కూల్స్ ఉన్నాయి. వాటిలో 452 వరకు ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. మిగిలినవన్నీ ప్రైవేటు యాజమాన్యాల అధీనంలో ఉన్నాయి. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పూర్తిస్థాయి వసతులున్న పాఠశాలలను వేళ్లమీదే లెక్కపెట్టవచ్చు. పలు పాఠశాలల్లో మౌలిక వసతుల లేవు, విద్యార్థులకు సరిపడా ఆటస్థలాల కొరత, తరగతి గదుల కొరత ఉంది. అయినప్పటికీ, అధికారులు మాత్రం ఆ వైపు కన్నెత్తి చూసిన పాపాన పోవటం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. ఇలా అరకొర వసతులతో పాఠశాలలు నిర్వహిస్తున్నా ఫీజుల వసూళ్లలో మాత్రం పోటీపడి మరీ వసూలు చేస్తున్నాయి. ఇది చాలదన్నట్లు పుస్తకాల దోపిడీ అదనంగా ఉంటోంది. ప్రభుత్వ ధరల ప్రకారం ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాల ధరలు రూ.280 నుంచి రూ. 700ల వరకు ఉన్నాయి. వీటికి తోడు అదనంగా నోటు పుస్తకాలు కొనుగోలు చేయాల్సి ఉంది. పెద్ద తరగతులకు నోటు పుస్తకాల ఖర్చు కాస్త ఎక్కువగా ఉంటుందనుకున్నా.. గరిష్టంగా రూ.1500 మించి ఉండదు. అన్ని కలిపి పదో తరగతికి కూడా రూ.2 వేలు పుస్తకాల ఖర్చు సరిపోతుంది. అయితే ప్రైవేటు పాఠశాలలు ఇష్టానుసారంగా పుస్తకాల ధరల మోత మోగిస్తున్నాయి. ఎల్‌కేజీ, యుకేజీ తరగతులకే రూ.3 వేలు వసూలు చేస్తుండగా, పెద్ద తరగతులకు రూ.8 వేలు నుంచి రూ. 10 వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. తమ పిల్లల్ని ఎక్కడ వేధిస్తారోననే భయంతో తల్లిదండ్రులూ ప్రశ్నించడం మానేశారు. దీంతో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల నిర్వహకులు దోపిడిని మరింత పెంచారు.

అప్రజాస్వామిక నిర్ణయాలతోనే వైసిపి ఓటమి : ఓబులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఐదేళ్ల పాటు వైసిపి ప్రభుత్వం అప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకుని ప్రజలు, కార్మిక, కర్షకలు, రైతులు, ఉద్యోగులను ఇబ్బందికి గురి చేయడం వల్లనే ఎన్నికల్లో ఓటమి పాలైందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు విమర్శించారు. పుట్టపర్తి సిపిఎం కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం ప్రజలకు నష్టం కలిగించే అనాలోచిత నిర్ణయాలు అనేకం తీసుకుందన్నారు. ఇసుక, మద్యం మాఫియా, కొండలు, గుట్టల భూముల అక్రమణలు, మంత్రులు ఎమ్మెల్యేలు మాటతీరు వంటి ఎన్నో ప్రజా వ్యతిరేక విధానాల వల్ల జగన్ ప్రభుత్వం ఎన్నికల్లో చతికిల పడిందన్నారు. ఏ ప్రభుత్వాలైన రైతులు, కార్మికులు, ఉద్యోగులను విస్మరించరాదన్నారు. అంగన్వాడీ, మున్సిపల్, కార్మికులు, ఆశాలు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు వారి న్యాయమైన కోర్కెలు తీర్చాలని ఎన్నో సమయాల్లో వినతులు అందించారన్నారు. అయినా స్పందించకపోతే పోరాటాలకు దిగారన్నారు. ఇలాంటి సమయంలో వైసిపి ప్రభుత్వం ఉద్యోగుల పట్ల కఠినంగా వ్యవహరించిందన్నారు. జగన్ అధికారంలో ఉండగా లక్షలాది మంది ఉద్యోగులు, కార్మికులతో కన్నీళ్లు పెట్టించారని గుర్తు చేశారు. ఆ ప్రభావం ఎన్నికల్లో ఆయన్ను దెబ్బతీసిందని తెలియజేశారు. కరువు జిల్లా ఉమ్మడి అనంతపురంలో పండ్లతోట పెంపకంకు ఎంతో ఆసరగా ఉన్న డ్రిప్ ఇరిగేషన్‌ను ఎత్తేసిన ప్రభుత్వం వైసిపి అన్నారు. నాడు నేడు కింద పాఠశాలలను బాగు చేసినా, తరగతుల విలీనం పేరుతో ప్రభుత్వ పాఠశాలల ఉనికినే ప్రశ్నార్థం చేశారన్నారు. గతంలో కూడా దేశంలో ఇందిరా గాంధీ, ఎన్టీఆర్, రాజశేఖర్‌రెడ్డి, జయలలిత, చంద్రబాబు నాయుడులు కార్మికులు రైతుల, పట్ల నిరంకుశంగా వ్యవహరించి వారి ఆగ్రహానికి గురయ్యారన్నారు. ప్రస్తుతం జగన్మోహన్‌రెడ్డికి అలానే జరిగిందన్నారు. ఇక కేంద్రంలో బిజెపి రామున్ని అడ్డం పెట్టుకుని ఎన్నికల రాజకీయాలు చేసిందన్నారు. ఇంత చేసినా రాముని గుడి కట్టిన ఆయోధ్య నియోజకవర్గంలోనే బిజెపి ఓటమి పాలైందన్నారు. మతతత్వంతో ఓట్లు పొందాలని చూసిన మోడీకి ప్రజలు బుద్ధి చెప్పారని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడే ప్రభుత్వం రాష్ట్ర విభజన విషయంలో ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం మాట్లాడి నెరవేర్చాలా చూడాలన్నారు. రాష్ట్రానికి రావాల్సిన అన్ని విధాలా సాయాన్ని పూర్తి స్థాయిలో కేంద్రం నుంచి పోరాడి సాధించుకోవాలని తెలిపారు.

కూలిన వందేళ్ల చెట్టు

నేలకొరిగిన వందేళ్ల వృక్షం

పుట్లూరు : మండల కేంద్రంలోని శివాలయం వద్ద ఉన్న వందేళ్ల పైబడిన జీయ చెట్టు బుధవారం రాత్రి కురిసిన వర్షానికి నేలకొరిగింది. ఎందరికో నీడనిచ్చిన చెట్టు కూలిపోవడంతో భక్తులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే చెట్టు కింద పడే సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. దీంతో స్థానికులు, భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

చెట్లు పెంచి పచ్చదనాన్ని కాపాడాలి

విత్తనాల బాళ్లను తయారు చేస్తున్న అంగన్‌వాడీలు, చిన్నారులు

పెద్దపప్పూరు : వర్షాకాలం ప్రారంభం కావడంతో ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పచ్చదనాన్ని పరిరక్షించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నారాయణమ్మ, రామలక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం మండలం పరిధిలోని చిన్నపప్పూరు, జూటూరు గ్రామాల్లోని అంగన్వాడీ సెంటర్లలో విత్తనాలతో కూడా బాళ్లను తయారు చేసి ఖాళీ ప్రదేశాల్లో వెదజలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు పెరిగి పెద్దవైతే మానవాళికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, కార్యకర్తలు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సేవలు అమోఘం

ఈడీ జి.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ఉత్తమ డ్రైవర్లకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఆర్టీసీ ఈడి వెంకటేశ్వరరావు

ఆర్టీసీ సంస్థ అభివృద్ధిలో కార్మికుల సేవలు అమోఘమని ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈడీ గురువారం స్థానిక ఆర్టీసీ డిపోను సందర్శించి అధిక ఆదాయం, కేఎంపీలు సాధించిన డ్రైవర్లు, కండక్టర్లకు ఉత్తమ సేవా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సు సర్వీసుల ప్రయాణాలకు సంబంధించిన డ్రైవర్, కండక్టర్ నారాయణ, అనుష, బిఎంకె సాబ్‌లను ప్రశంసించారు. అలాగే మెయింటెనెన్స్ విధానంలో ప్రతిభ కనబరిచిన శేఖర్, ప్రతాప్‌లకు కూడా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈడీ మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ కన్నతల్లి లాంటిదని కొనియాడారు. సంస్థ అభివృద్ధి బాటలో నడిస్తేనే మన కుటుంబాలు సైతం అభివృద్ధి చెందుతాయని గుర్తుచేశారు. ప్రతి కార్మికుడు ప్రయాణికుల సౌకర్యార్థం సమయపాలన పాటిస్తూ ఆర్టీసీ సర్వీసులను నడపాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయివేట్ పశువులకు దీటుగా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. ఆర్టీసీ బస్సులోనే సురక్ష ప్రయాణం లభిస్తుందనే విషయాలను ప్రయాణికులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ సుమంత్, ఆదోని రమేష్‌బాబు, సిపిఎం రామచంద్ర, డిపో మేనేజర్ సురేంద్రబాబు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న భూమిరెడ్డి ట్రస్టు సభ్యులు

పుట్లూరు : పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించి ఉన్నత చదువులకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న మండల కేంద్రంలోని బొంత ప్రణతికి భూమిరెడ్డి ఛారిటబుల్ ట్రస్టు గురువారం ఆర్థికసాయం అందజేశారు. ఈమేరకు రూ.10వేల చెక్కును విద్యార్థిని తల్లికి ట్రస్టు సభ్యులు బి.రాజమ్మ, రామంజులరెడ్డి అందించారు. ఆర్థికసాయం అందించినందుకు భూమిరెడ్డి ట్రస్టుకు ప్రణిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధికి ప్రజాప్రణాళికతో ముందుకెళ్లండి

శింగనమల నూతన ఎమ్మెల్యేకు సిపిఎం సూచన

శింగనమల మండలం రాచేపల్లి వద్ద నిరుపయోగంగా ఉన్న లెదర్ పార్క్

ప్రజాశక్తి-నార్పల

శింగనమల నియోజవకర్గంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారించి, అభివృద్ధి జరిగేలా ప్రజాప్రణాళికతో ముందుకెళ్లాని నూతన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం నాడు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, ఓ.నల్లప్ప, బాల రంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు తరిమెల నాగరాజు, మండల కార్యదర్శులు భాస్కర్, కుళ్లాయప్ప, చెన్నారెడ్డి, సూరి, కుల్లాయప్ప, ఓబులేశుప్రకటన విడుదల చేశారు. ఇందులో పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

శింగనమల నియోజకవర్గంలోని విద్యా రంగంలో అన్ని గురుకుల పాఠశాలల్లో కాస్మాటిక్ ఛార్జీలు, నోట్ పుస్తకాలు, ఇతర సదుపాయాలకు నిధులు పెంచి సకాలంలో ఇవ్వాలి. పుట్లూరు మండల కేంద్రంలో నిర్మించిన ప్రభుత్వం జూనియర్ కళాశాలను ప్రారంభించాలి. నియోజకవర్గంలో ఉన్న అన్ని సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలకు మరమ్మతులకు నిధులు కేటాయించి పనులు చేపట్టాలి. నియోజకవర్గం కేంద్రంలో ఉన్న జూనియర్ కాలేజీలో బైపిసి, ఎంపిసి గ్రూపులను, ఇంగ్లీషు మీడియాను ప్రవేశపెట్టాలి. పాఠశాలను ఏర్పాటు చేయాలి. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో బాలికలకు ప్రత్యేక బాలికోన్నత పాఠశాలను ఏర్పాటు చేయాలి. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో ఎపి మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలి. నియోజకవర్గంలో అన్ని మండల కేంద్రాల్లో డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలి. క్రీడలను ప్రోత్సహించేందుకు బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో ఇండోర్ స్టేడియంను ఏర్పాటు చేయాలి. ప్రతి మండలంలో వత్తి శిక్షణకు ఐటిఐలను ఏర్పాటు చేయాలి.

వైద్యరంగానికి సంబంధించి నియోజకవర్గ కేంద్రం శింగనమలలో ఉన్న సామాజిక వైద్యశాల, బుక్కరాయసముద్రంలోని పట్టణ ఆరోగ్య కేంద్రంతో పాటు కొర్రపాడు, తరిమెల, బి.పప్పూరు గ్రామాల్లో ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, 24 గంటల ఆసుపత్రులుగా మార్చాలి. మౌలిక సౌకర్యాలు,, మందులతో తగిన సిబ్బందిని నియమించాలి. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కన్వెన్షన్ హాలుకు రూ.10 కోట్లు నిధులను మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టాలి. అన్ని మండల కేంద్రాల్లో డాక్టరు బి. ఆర్. అంబేద్కర్ భవనాలను నిర్మించాలి, అందుకు నిధులు మంజూరు చేయాలి. గతంలో నియోజకవర్గంలో మంజూరు అయిన అంబేద్కర్ భవనాలకు స్థలాలు కేటాయించాలి. జీవో నెంబర్ 381ను రద్దు చేసి నిర్మాణాలు చేపట్టాలి. నియోజకవర్గంలోని మరవ వంకలపై బ్రిడ్జిలు నిర్మాణాలు చేపట్టాలి. బుక్కరాయసముద్రం మండల తహశీల్దారు కార్యాలయం ముందు ఉన్న మరవవంక, శింగనమల చెరువు కింద ఉన్న మరవవంక, నియోజకవర్గంలోని వివిధ చెరువు కింద ఉన్న మరవవంకలకు బ్రిడ్జిలను నిర్మించేందుకు నిధులు విడుదల చేయాలి.

పర్యాటక రంగాన్ని అభివద్ధి చేయాలి. నార్పల మండలం గూగూడు కుళ్లాయిస్వామి, బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని దేవరకొండ కొండమీదరాయుని ఆలయం, శింగనమల మండల కేంద్రంలోని రుషింగమయ్య కొండను పర్యాటక కేంద్రాలుగా అభివద్ధి చేయాలి. శింగనమల, బుక్కరాయసముద్రం చెరువుల మధ్యలో బుద్ధ విగ్రహం, అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేసి, బోటింగ్ ద్వారా విహార ప్రదేశాలుగా చేయాలి. శింగనమల నియోజకవర్గంలో టెక్స్ టైల్ పార్క్ అభివద్ధి చేయాలి. నార్పల మండల కేంద్రంలో చేనేత పార్కును ఏర్పాటు చేయాలి. చేనేత కార్మికులకు ముడి సరుకు సబ్సిడీపై ఇవ్వాలి. కార్మికులకు గుర్తింపు కార్డులు, కూలి మగ్గంపై పని చేసే కార్మికులుకు, సొంత మగ్గం ఉన్న అర్హులకు నేతన్న నేస్తం ఇవ్వాలి.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టి మంచినీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కారం కోసం నార్పల, బుక్కరాయసముద్రం మండల కేంద్రాల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించాలి. అన్ని గ్రామాలకు గండికోట రిజర్వాయర్ ద్వారా పనులను పూర్తి చేసి మంచినీటి సౌకర్యం కల్పించాలి. పుట్లూరు మండల సాలవేముల జాజికొండ వాగుకు చిన్నపాటి రిజర్వాయర్ నిర్మిస్తే 34 గ్రామాలకు తాగునీరు అందివ్వవచ్చు. నియోజకవర్గంలో పండ్ల తోటల ఆధార పరిశ్రమ ఏర్పాటు చేయాలి. వివిధ పండ్ల తోటల విస్తీర్ణం పెరుగుతున్న రిత్యా పళ్ల రసాల పరిశ్రమను ఏర్పాటు చేసి, మార్కెటింగ్ కల్పించాలి. పాడి పరిశ్రమ అభివద్ధికి చర్యలు తీసుకోవాలి. బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురం గ్రామంలో వెటర్నరీ సట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి డాక్టర్, సిబ్బందిని నియమించాలి. నీటి పారుదలను అభివద్ధి చేయాలి. పెనకచెర్ల డ్యాం నుంచి బైపాస్ కాలువ పనులు చెపట్టాలి. శింగనమల మండలం సలకంచెరువుకు హెచ్‌ఎల్.సి నీళ్లు ఇవ్వాలి. చాగల్లు రిజర్వాయర్ కింద ముంపునకు గురైన ఉలికల్లు, ఉలికంటిపల్లి గ్రామాలకు చెందిన ముంపు బాధితులకు గత 14 సంవత్సరాలు అయినా నష్టపరిహారం అందలేదు. పునరావాసానికి, మౌలిక సదుపాయాలు కల్పించలేదు. నష్టపరిహారం, పునరావాసం కల్పించాలి. ఖనిజ ఆధార పరిశ్రమల ఏర్పాటు చేసి డోలమైట్, బ్లాక్ గ్రానైట్, వైట్ గ్రానైట్ ఖనిజాలు ఉన్నాయి. వీటి ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలి. లెదర్ పార్కును పునరుద్ధరించి శింగనమల మండలం రాచేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన లెదర్ పార్కును పునరుద్ధరించాలి. గతంలో శిక్షణ పొందిన యవతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా వచ్చిన సెంట్రల్ యూనివర్సిటీ నిర్మాణానికి కేంద్రం నుంచి నిధులు రాబట్టాలి. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలి. బుక్కరాయసముద్రం సర్పంచి చెక్ పవర్‌ను పునరుద్ధరణ చేయాలి.

అర్హత కలిగిన వారికి ఇంటి పట్టాలు, ఇళ్లు మంజూరు చేయాలి. అన్ని మండలాల్లో అసంపూర్తిగా ఉన్న రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలి. స్వచ్ఛ భారత్ కార్మికుల వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలి. నియోజకవర్గంలోని అర్హతగల రైతులందరికీ డ్రిప్పు, స్పింకర్లు వందశాతం రాయితీతో ఇవ్వాలి. పాముర్రాయి నుండి అమరావతి రోడ్డు విస్తరణ 544డి కింద ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్ల స్థలాలు, ఇళ్ల ను మంజూరు చేయాలి. చామలూరు వద్ద ఇండస్ట్రియల్ ఎస్టేట్‌ను ఏర్పాటు చేయాలి. ఈ సమస్యలన్నింటిపై ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ స్పందించి పనులను చేపట్టాలి.

వైసిపి నాయకుడి ఇంటిపై దాడి యత్నం

కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం ఎమ్మెల్యేగా గెలుపొందిన అమిలినేని సురేంద్రబాబు విజయోత్సవ ర్యాలీలో భాగంగా బుధవారం రాత్రి వైసిపి నాయకుడు ఉమామహేశ్వర్‌నాయుడు ఇంటిపై దాడికి యత్నించి నట్లు బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి పొద్దు పోయాక టిడిపికి చెందిన అల్లరి మూకలు ఉమామహేశ్వర్‌నాయుడు ఇంట్లోకి రాళ్ళ రువ్వడంతో ఇంటి అద్దాలతో పాటు పలు వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయని ఉమా ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య, వైసిపి శ్రేణులు ఉమా ఇంటి వద్దకు చేరుకొని జరిగిన ఘటనపై ఆరా తీశారు. అలాగే జిల్లా ఎస్పీ గౌతమిశాలి డీఎస్పీ బి.శ్రీనివాసులు, సిఐలు హరినాథ్, చంద్రశేఖర్, నాగరాజు, ఎస్ఐలతో కలిసి ఉమా ఇంటిని పరిశీలించి ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించారు.

చంద్రబాబును కలిసిన పయ్యావుల

చంద్రబాబుతో పయ్యావుల

కలెక్టరేట్ : విజయవాడలో నివాసంలో టిడిపి అధినేత చంద్రబాబును జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పయ్యావుల కేశవ్, కాలవ శ్రీనివాసులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి కాబోతున్నందుకు చంద్రబాబుకు బొకేలు అందజేసి ఇందులో భాగంగా శుభాకాంక్షలు తెలిపారు. కాగా టిడిపి మంత్రివర్గం ఆశావాహుల్లో వీరిద్దరూ ఉన్నట్లు తెలుస్తోంది.

మహారాజశ్రీ అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు, అనంతపురము.

IA 183 to 185/2021 in IA 453/2015
in OS 364/2008

Between:
1) కె. నాగవేణి
2) కె.మధుబాయి – పిటీషనర్స్

V/s

బి.కోలనాగప్ప(died)
మరియు ఇతరులు – రెస్పాండెంట్స్

R10: R.జోష్నా W/o అంజి
ఫ్లాట్ నెం. 57, మయూర అపార్ట్‌మెంట్స్, బేగంపేట, సికింద్రాబాద్.

నోటీసు

పై పిటీషన్స్‌లో 8వ ప్రతివాది/రెస్పాండెంట్ కోర్టులో హాజరు నిమిత్తం 25-06-2024వ తేదీ ఉదయం 10-30 గంllలకు వాయిదా వేసినారు. కావున మీరు స్వయంగా కానీ లేదా వకీలు ద్వారా కానీ హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. అట్లు హాజరు కాని యెడల పిటీషన్స్ మీ పరోక్షముగా తీర్మానించెదరు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

శ్రీ కె.ఎల్.ఎన్. ప్రసాద్
అడ్వకేటు, అనంతపురము.

IN THE COURT OF THE II ADDITIONAL CIVIL SENIOR CIVIL JUDGE :: BALLARI

O.S. No.500/2023

Between:
Sri Sai Kumar and another ... Plaintiff

And

Sri Paramesh Kunda by His G.PO
Smt K.Nagarathnamma and others ... Defendants

Notice / Summons
(Order 5 Rule 20 of C.P.C.)

To,
Defendants No3:-
Sri Paramesh Kunda, S/o Kunda Murthy @ Mula Setty, R/o Chaganur village, Ballari Taluka, Ballari District, **Present Address, T-26-2, Bhagya Nagar, Guntakal Ananthapuramu Dist. A.P. State.**

Whereas, M.Sai Kumar S/o M.Hulugesh, has instituted a civil suit O.S. No.500-2023, against the defendants for Declaration and possessions of suit property and to declare their legitimate rights, to declare absolute ownership, in the suit property under a Regd., WILL dated 20-12-1994 bequeathed to the Plaintiffs by their maternal great grandmother Smt. Lakshmamma,. The defendants No 1 and 2 were served except you have avoided, when suit summons sent by R.P.A.D., in view of this, this paper publication taken. You the defendant No 3 are hereby summoned to appear in this court in person or by a pleader before this court on **3rd day of July 2024 at 11-00 O' clock** to answer the claim, as on the day fixed, for you appearance. Further you are hereby directed to file written statement and of your defences to produce all your documents in your possession in the above suit.

Take notice thatin default of your appearance on the day before mentioned date, the above suit will be heard and determined in your absence.

Given under my hand and the seal of the court on this 31st day of May 2024.

|| *By order of the Court* ||

D.N. Jayanth & N.L. Prasad
Advocates for the Plaintiffs

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, PENUKONDA.

O.S. No.70/2017

Between:
B.S. Sivappa ... Plaintiff

And

B.S.Chinna Peddanna died by LRs and Others ... Defendantes

Summon to Defendant No:7

To,
D7:- M.Santhamma W/o M.Venkata Ramappa aged about 48years, Hindu, Agriculturist D.No.4-27B Sadar Veedhi, Atmakur (Vi) and (M)

ఇందుమూలముగా నీకు తెలియజేయునది ఏమనగా B.S.శివప్ప S/o. B.S.సంజీవప్ప, D.No.5-332, శ్రీరాములయ్య కాలనీ, పెనుకొండ టౌన్ మరియు మండలం అనునతను నీ మీద వేసిన దావా O.S. 70/2017 పై కోర్టులో 23-6-2024వ తేదీన వాయిదా వున్నది. పై తేదీన నీవు ఖుద్దున గాని లేక వకీలు ద్వారా గాని పై కోర్టు యెదుట ఉదయము గంll 10-30నిllలకు హాజరు కావలయును.

అట్లు హాజరుకాని యెడల పై వ్యాజ్యము నీ పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలముగా నీకు తెలియ జేయడమైనది.

"కోర్టు వారి ఉత్తర్వు మేరకు"

ఇట్లు: **జి. మల్లిరెడ్డి**
వాది పరం వకీలు

In the Court of the Prl. District Judge, Ananthapuramu.

E.P. No.402/2023 in O.S. No: 136/2017

Between:
Gonuguntla Kristappa ... Decree-Holder

V/s

B. Sreedevi ... Judment-Debtor

వేలం ప్రకటన

పై నెంబరు దావా నందు డిక్రీ హోల్డరు తనకు రావాలసిన డిక్రీ మొత్తం రాబట్టుకొనుటకై ప్రతివాదికి హక్కు గల ఆస్తిని వేలంనకు తెచ్చి యున్నారు. కావున సవాలుదార్లు ఎవరైననూ పైకోర్టు యందు 26-06-2024వ తేదీన వేలం జరుగును. కోర్టు వారి నిబంధనల మేరకు జరుగును.

షెడ్యూలు:

House Property Situated at R.D. and SRD of Ananthapuramu within the Municipal Corporation Limits of Aanthapuramu.

Word	Sy.No.	Z.P.No.	Plot No.
Old-4	277/2	77/66	20
New-8	273/2B		
Present-12			

Extent: Ac.0.05 Cents out of AC00.10 1/2 Cents. H.S. 0.020(on Western Side in Plot No20)

Boundaries:
East : Remaining plot No.20 belongs to K. Thimmareddy
South: Plot No.21
West: 40'feet Road
North: 40'feet Road.

Measurements:
East - West : 44'feet or 13.42 Meters
North - South : 50'feet or 15.25 Meters
Amina Value : Rs. 25,00,000/-
D.Hr. Value : Rs. 25,00,000/-

ఇట్లు:
అల్లు నారాయణప్ప
అడ్వకేటు, అనంతపురము, సెల్: 9908616177

In the Court of the Prl. District Judge, Ananthapuramu.

E.P. No.454/2023 in O.S. No: 45/2015

Between:
D.S. Venkateswarlu Naidu ... Decree-Holder

V/s

K.Murali Krishna (died by L.Rs.) ... Judment-Debtors

వేలం ప్రకటన

పై నెంబరు దావా నందు డిక్రీ హోల్డరు తనకు రావాలసిన డిక్రీ మొత్తం రాబట్టుకొనుటకై ప్రతివాదికి హక్కు గల ఆస్తిని వేలంనకు తెచ్చి యున్నారు. కావున సవాలుదార్లు ఎవరైననూ పైకోర్టు యందు 18-06-2024వ తేదీన వేలం జరుగును. కోర్టు వారి నిబంధనల మేరకు జరుగును.

షెడ్యూలు:

House Property Situated at R.D. and SRD of Ananthapuramu within the Municipal Corporation Limits of Aanthapuramu.

Word	Sy.No.	D.No.	Asst.No.
Old-4	282/2B2	Old:	Old:
New-8		New:	New:
Present-12	Present 553-A1		Present:1001038673

at Present D.No.12-3-563, HSC No.0004118508 with upstair and Municipal Tap Connection.

Boundaries:
East : House of Lakshmidevamma
South: 8'feet Road,
West: Property belongs to M.K. Samamthakamani
North: 8'feet Road.

Measurements:
East - West : $13\frac{3'}{4}$ feet or 4.19 Meters.
North - South : 55'feet or 16.77 Meters.
Amina Value : Rs. 50,00,000/-
D.Hr. Value : Rs. 25,00,000/-

అల్లు నారాయణప్ప
అడ్వకేటు, అనంతపురము.
సెల్: 9908616177

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కమిషనర్‌కు సిఐటియు నేతల వినతి

కమిషనర్ మేఘస్వరూప్‌నకు వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్పొరేషన్ కార్మికుల పెండింగ్ సమస్యలను సత్వరం పరిష్కరించాలని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో కమిషనర్ మెగా స్వరూప్‌నకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ పారిశుధ్యం, ఇంజనీరింగ్ సెక్షన్ విభాగాలకు సంబంధించిన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏళ్ల తరబడి ఆందోళనలు, పోరాటాలు చేయడంతోపాటు ఎన్నోసార్లు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఏ ఒక్కరూ పట్టించుకోలేదన్నారు. ముఖ్యంగా ఇపిఎఫ్, ఇఎస్ఐలకు సంబంధించి దళారీల వ్యవస్థలు ఏర్పాటు చేసి కార్మికుల దగ్గర రూ.వేలకు వేలు దండుకుని మరణించిన కార్మికుల కుటుంబాలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. అలాగే నగరంలో జనాబాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇంజనీరింగ్ సెక్షన్‌కు సంబంధించిన 309 మంది కార్మికులకు 2011లో తొమ్మిది నెలల ఇపిఎఫ్, ఇఎస్ఐకి సంబంధించిన డబ్బు ఇప్పటికీ కార్మికుల అకౌంట్లో జమ కాలేన్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు బకాయి డిఎలు, ఇంక్రిమెంట్లు, విశ్రాంత కార్మికుల కుటుంబాలకు రావాల్సిన సౌకర్యాలను కల్పించడం లేదన్నారు. ప్రధానంగా మహిళలు చెప్పుకోలేని సమస్యలతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అదనంగా విధులు నిర్వహిస్తున్న కోవిడ్, గార్బేజ్ క్లాప్ ఆటో డ్రైవర్లకు బకాయి వేతనాలు ఇవ్వకుండా వెట్టి చాకిరీ చేయిస్తున్నారన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇందుకు కమిషనర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐదు రోజులు గడువు ఇస్తే జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెగ్యులర్ ఉద్యోగ కార్మిక సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు ముతురాజు, నల్లప్ప, నగర కార్యదర్శి సాకే తిరుమలేష్, ఇంజనీరింగ్ సెక్షన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, సంజీవరాయుడు, ఇంజనీరింగ్ సెక్షన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఓబుళపతి, మురళి, ట్రెజరర్ పోతలయ్య, కమిటీ సభ్యులు నారాయణస్వామి, బంగ్లా రాఘవేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రివర్గంలో
'కాలవ'కు స్థానం దక్కేనా.?

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం అసెంబ్లీ స్థానం నుంచి తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికైన కాలవ శ్రీనివాసులుకు త్వరలో ఏర్పడబోయే రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం దక్కుతుందని స్థానికులు భావిస్తు న్నారు. 2014-19 టిడిపి ప్రభుత్వంలో రాయదుర్గం ఎమ్మెల్యేగా గెలిచిన కాలవ శ్రీనివాసులుకు తొలుత రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్‌గా, అనంతరం గ్రామీణ గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రిగా అవకాశం లభించింది. ప్రస్తుతం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో అత్యధిక మెజార్టీ సాధించిన కాలవకు రెండోసారి కూడా మంత్రివర్గంలో చోటు లభిస్తుందని అభిప్రాయ పడుతున్నారు. కాలవ రెండు దశాబ్దాలుగా పార్టీలో పొలిట్‌బ్యూరో సభ్యులుగా కొనసాగుతున్నారు. అంతేకాక టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా అనేక ఒత్తిళ్లను ఎదుర్కొన్నారు. అనేక అంశాలపై ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. పోలీసులు పలుసార్లు కాలవను గృహనిర్బంధం చేశారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు సుమారు నాలుగు నెలలుగా నియోజకవర్గం అంతటా విస్తృతంగా పర్యటించి అనేకమంది వ్యక్తులను కలిసి రాబోయే ఎన్నికల్లో తనకు అండగా ఉండాలని కోరారు. పలు సామాజిక వర్గాలను కలిసి మద్దతు కూడగట్టుకున్నారు. జనసేన, బిజెపి, టిడిపి కూటమి ప్రచారం, సహకారం కూడా కాలవకు కలిసొచ్చింది. ఎన్నికల్లో కనీసం 50వేల ఓట్ల మెజారిటీ వస్తుందని ధీమాగా ఉండగా 42 వేల ఓట్ల పైచిలుకు ఆధిక్యతను సాధించారు. కాగా జిల్లాలో మంత్రి వర్గంలో స్థానం పొందేందుకు ఇతర శాసనసభ్యులు కూడా పోటీలో ఉన్నారు. ఉరవకొండ శాసన సభ్యులు పయ్యావుల కేశవ్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కూడా మంత్రి పదవి రేసులో ఉన్నారు. జిల్లాలో ఇద్దరికి మించి మంత్రి పదవులు ఇవ్వలేని పరిస్థితి నెలకొన్న పక్షంలో కాలవకు మంత్రివర్గంలో చోటు లేకపోతే అసెంబ్లీ స్పీకర్ లేదా రాష్ట్ర ప్రభుత్వ విప్ పదవి కూడా వరించే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నెరవేరిన నాలుగు దశాబ్దాల కల
ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

బండారు నారాయణస్వామి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

తమ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కావాలన్న తమ తాత నాలుగు శతాబ్దాల కల నేటితో నెరవేరిందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. గురువారం కుటుంబ సభ్యులతో కలిసి బుక్కరాయసముద్రం మండలం సిద్ధలాపురం గ్రామంలో ఉన్న శ్రావణిశ్రీ తాత బండారు నారాయణస్వామి సమాధి వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి సాధించిన ఇంత ఘన విజయంలో తాను భాగస్వామి కావడం సంతోషంగా ఉందన్నారు. సాధారణ ఎన్నికలో తన గెలుపు కోసం అహర్నిశలు పని చేసిన నియోజకవర్గం టిడిపి నాయకులు, కార్యకర్తలు, బిజెపి, జనసేన నాయకులలు, కార్యకర్తలకు రుణపడి ఉంటానన్నారు.

ఎమ్మెల్యేలకు అభినందనలు

దగ్గుపాటి ప్రసాద్‌కు అభినందనలు తెలుపుతున్న టిడిపి నాయకులు

అనంతపురం కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల్లో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్‌కి పలువురు టిడిపి నాయకులు గురువారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బొకేలు అందజేసి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, రాష్ట్ర కార్యదర్శులు బుగ్గయ్యచౌదరి, దేవళ్ల మురళి, రామలింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు అనంతపురంలోని ఆమె నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అభినందనలు తెలిపిన వారిలో మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మాసూల చంద్రమోహన్, టిఎన్‌టియుసి జిల్లా ఉపాధ్యక్షులు గోగుల నాగభూషణ, పెద్ద నాగమణి, కార్యకర్తలు ఉన్నారు.

'ఆలం'కు టిడిపి నేతల శుభాకాంక్షలు

ఆలం నరసానాయుడుకు అభినందనలు తెలుపుతున్న టిడిపి నాయకులు

నార్పల : ఎమ్మెల్యేగా బండారు శ్రావణిశ్రీ విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించిన నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడును పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసి గురువారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి పార్టీ అధికారంలోకి వచ్చినందుకు అభినందనలు తెలిపారు.

రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలి : ఆర్‌పిఎస్

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో గెలుపొందిన ఎన్‌డిఎ కూటమి నాయకులు రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే బాధ్యతను తీసుకోవాలని రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు పోతుల నాగరాజు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. కేంద్రంలో టిడిపి మద్దతు అవసరం కాబట్టి రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడే ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను పూర్తిస్థాయిలో సాధించేందుకు కృషి చేయాలన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడానికి ఉద్యోగుల పాత్ర చాలా కీలకంగా ఉందన్నారు. ఇప్పుడు కేంద్రం చేతిలో ఉన్న సిపిఎస్ రద్దు అంశంపై స్పష్టమైన హామీతో మద్దతు ఇవ్వాలన్నారు. అలాగే రాష్ట్రంలో పెండ్డింగ్ ప్రాజెక్టులు, వ్యవసాయ రంగ అభివృద్ధి, యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనకు పరిశ్రమలు ఏర్పాటు, రైల్వేజోన్, విశాఖ ఉక్కు పరిశ్రమ పురోగతి కోసం చంద్రబాబు, పవన్ కృషి చేయాలన్నారు.

నమ్మక ద్రోహులను ఉపేక్షించం

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పామిడి

సార్వత్రిక ఎన్నికల్లో పార్టీకి నమ్మక ద్రోహం చేసిన నాయకులను ఉపేక్షించేది లేదని మండల టిడిపి నాయకులు హెచ్చరించారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల ముఖ్య సమావేశంలో నాయకులు మాట్లాడుతూ గుమ్మనూరు జయరామ్ నాయకత్వం నచ్చి టిడిపి అధినేత చంద్రబాబు ఎమ్మెల్యే టికెట్ కేటాయించారన్నారు. దీంతో జయరామ్ కూడా అతి తక్కువ సమయంలోనే నాయకులు, కార్యకర్తలను కలుపుకుపోయి విజయాన్ని సొంతం చేసుకున్నారన్నారు. అయితే పార్టీలో కొంతమంది కోవర్టులుగా పని చేసి గుమ్మనూరు గెలుపును అడ్డుపడాలని చూసినా సాధ్యం కాలేదన్నారు. అయితే పార్టీలో ఉంటూ కన్నతల్లి లాంటి పార్టీకి వెన్నుపోటు పొడిచిన నాయకులను ఉపేక్షించేది లేదని, కచ్చితంగా అధిష్టానానికి తెలియజేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పామిడి మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి
మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి

ప్రజాశక్తి-వజ్రకరూరు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి సూచించారు. గురువారం ఉరవకొండ మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఆధ్వర్యంలో చిన్నముష్టూరు, రాకెట్ల, రాకెట్ల తండా, షేక్షానిపల్లి, షేక్షానిపల్లి తండా, రాచర్ల తండా గ్రామాల్లో మలేరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాఫిలాస్ అనే ఆడదోమ కాటు వల్ల మలేరియా వ్యాధి వస్తుందన్నారు. ఈ దోమలు ఎక్కువగా నీటిలో గుడ్లు పెట్టి అభివృద్ధి చెందుతాయని తెలిపారు. కావున ఇంట్లోగానీ, పరిసరాల్లోగానీ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని తెలిపారు. మలేరియా జ్వరం వచ్చిన వారికి మొదట చలి వేసి, జ్వరం వచ్చి తర్వాత చెమటలు పట్టి జ్వరం విడిచి పెడుతుందన్నారు. ఇలాంటి లక్షణాలు ఉంటే మలేరియా భావించి వెంటనే వైద్యుల్ని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ నాగరంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్, హేమలత, సిఒ భగవాన్‌దాస్, నాగరాజు, ఆశాకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది